క్లుప్తంగా

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

విజయనగరం రూరల్: నగరంలోని బీజేపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్వర్మ.. ఆ పార్టీ జెండా ఆవిష్కరించి, పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు సాధించిన విజయాలను వివరించారు. విలువలతో కూడిన రాజకీయం చేస్తూ సుపరిపాలన అందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించిందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, పార్లమెంట్ కన్వీనర్ ఎస్.లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ధోరణి దారుణం..

విజయనగరం గంటస్తంభం: వక్ఫ్ బోర్డు సవరణ రాజ్యాంగ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని, బీజేపీ మైనార్టీ వ్యతిరేక ధోరణికి ఈ సవరణ నిదర్శనమని, ప్రజలంతా దీన్ని వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్ రావు ధ్వజమెత్తారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక మూడు లాంతర్ల మసీదు వద్ద ముస్లిం సోదరులకు, పెద్దలకు కరపత్రాలు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ ఖాదర్ బాద్షా, పెద్దలు అన్సార్‌లు మాట్లాడుతూ.. సీపీఎం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని అభినందిస్తున్నామని పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డుకు బీజేపీ ప్రభుత్వం చేసిన సవరణలతో మరింత ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం: గంట్యాడ సమీపంలో ఉన్న టోల్ గేట్ వద్ద, అయ్యన్నపేట జంక్షన్ దగ్గర మధుపాడ పంపింగ్ లైన్ లీకైన కారణంగా నగరంలో కొన్ని చోట్ల సోమ, మంగళ వారాలలో రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులను చేపడుతున్న రీత్యా నీటి సరఫరాను పంపిణీ చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. 17, 19, 21, 22, 23, 24, 25, 38, 39, 41, 47 డివిజన్లలోని కొన్ని ప్రాంతాలలోనూ 18, 39, 40 డివిజన్లలో పూర్తిగానూ రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే నీటి సరఫరాను యథాతథం చేస్తామని తెలిపారు. నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాలలో ప్రత్యామ్నాయ వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరాను చేస్తామని తెలిపారు. ప్రజలు రెండు రోజుల పాటు నీటి సరఫరా అంతరాయానికి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామానికి చెందిన యువకులు.. విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ నెల 14వ తేదీన అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని, ఈ పోటీలు పెట్టామని యువకుడు రెయ్యి రామకృష్ణ తెలిపారు. విజేతలకు అదేరోజు బహుమతులు అందిస్తామన్నారు.

సిరిమాను చెట్టు తరలింపు



సిరిమాను చెట్టు తరలిస్తున్న దృశ్యం

బొబ్బిలి: మండలంలోని గొల్లపల్లిలో దాడితల్లి సిరిమానోత్సవానికి సంబంధించి, సిరిమాను తయారీకి కృష్ణాపురంలో గుర్తించిన సిరిమాను చెట్టును గ్రామానికి ఆదివారం తరలించారు. మే 4, 5, 6వ తేదీల్లో దాడితల్లి అమ్మవారి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మే 5వ తేదీన జరిగే సిరిమానోత్సవానికి సిరిమాను తయారు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు మండల జనార్దనరావు, వి.రవికుమార్, సాయి హేమంత్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు

రాజాం సిటీ: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఈ నెల 7వ తేదీ నుంచి ప్రవేశాలు ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర సంక్షేమ శాఖల కళాశాలలతో పాటు హైస్కూల్ ప్లస్ కళాశాలలన్నీ కలిపి మొత్తం 203 కళాశాలలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ చదవాలనుకునే వారంతా తమకు నచ్చిన కళాశాలకు వెళ్లి, నేరుగా దరఖాస్తు చేసుకుని కోర్సులో చేరవచ్చు. ఈ కొత్త విద్యా సంవత్సరం నుంచే నూతన విద్యా విధానం అమలు చేసి, ఇంటర్మీడియట్‌లో కొత్తగా ఎంబైపీసీ(మ్యాథ్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ)ని అందుబాటులోకి తీసుకువచ్చారు.

సంక్షోభ హాస్టళ్లు!



తలుపులు ఊడిన బాత్‌రూమ్‌లు



తప్పు పట్టిన మంచాలు



ఈ మోటారు ద్వారా వెళ్లే నీరే విద్యార్థులు తాగేది..



సుంకరి వీధి బాలికల హాస్టల్ ప్రధాన గేటు పరిస్థితి ఇదీ..



నిరుపయోగంగా ఉన్న గదిలో పనికిరాని బెడ్లు పడేసిన దృశ్యం

- సంక్షేమ హాస్టళ్లపై ప్రభుత్వం అలసత్వం
- వసతిగృహాల్లో కానరాని వసతులు
- అధ్వానంగా టాయిలెట్లు, బాత్రూమ్‌లు
- తుప్పు పట్టిన మంచాలు, పక్కన పడేసిన బెడ్లు
- నేల పైనే పడుకుంటున్న విద్యార్థులు



చెదలు పట్టేసి పెచ్చులూడిన కాటవీధి బాలురు వసతిగృహం

విజయనగరం టౌన్: సంక్షేమ హాస్టళ్లు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయి. ప్రభుత్వ అలసత్వం కారణంగా వసతులు కానరావడం లేదు. నాడు కళకళలాడిన గృహాలు ఇప్పుడు వెలవెలబోతున్నాయి. ఏ ఎస్సీ, ఎస్టీ వసతిగృహం చూసినా పెచ్చులూడిన శ్లాబ్‌లు.. చెదలుపట్టిన భవనాలు.. తలుపులు ఊడిన బాత్రూమ్‌లు.. మూలకు చేరిన మంచాలు, బెడ్లు.. అపరిశుభ్రంగా ఉండే గదులు, పరిసరాలే కనిపిస్తున్నాయి. మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి తల్లిదండ్రులను వీడి వచ్చిన విద్యార్థులకు సకల వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. అయితే అటు ప్రభుత్వాలు, ఇటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాటిల్లో తలదాచుకునే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలో మొత్తం 30 హాస్టళ్లు..

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లు(బాలబాలికలవి కలిపి) మొత్తం 30 ఉన్నాయి. వీటిలో 23 వసతిగృహాలను ప్రభుత్వ భవనాల్లో.. మరో ఏడింటిని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీటిలో ప్రీ మెట్రిక్ హాస్టళ్లు 14 ఉండగా, వీటిలో 12 బాలురుకు సంబంధించినవి, మిగిలిన రెండు బాలికలకు సంబంధించిన హాస్టళ్లు. వీటిల్లో మొత్తం 769 మంది విద్యార్థులు ఉంటున్నారు. అలాగే పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు 16 ఉండగా, వీటిలో బాలురు, బాలికలకు వేర్వేరుగా 8 చొప్పున ఉన్నాయి. వీటిల్లో మొత్తం 1322 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఈ వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు డైట్ చార్జీలతో పాటు కాస్మొటిక్ చార్జీలు, హెయిర్ కటింగ్ వంటి చార్జీలను ప్రభుత్వమే భరిస్తుంది.

బకెట్‌తో నీరు పట్టుకెళ్లాల్సిందే..

జిల్లా కేంద్రంలోని మొత్తం ఐదు హాస్టళ్లలో రెండు అద్దె భవనాల్లో.. మరో మూడు ప్రభుత్వ భవనాల్లో నడుపుతున్నారు. గుంటూరు వారి వీధి హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు అవసరమైన కనీస వసతులు లేవు. వసతిగదులు సక్రమంగా లేకపోవడంతో ఇరుకైన గదుల్లోనే కాలం వెల్లదీయాల్సిన పరిస్థితి. అలాగే నేలపైనే నిద్రించాల్సిన దుస్థితి. అలాగే కాట వీధిలోని ప్రభుత్వ బాలురు వసతిగృహానిదీ అదే పరిస్థితి. ఇక్కడి గదులన్నీ బూజులు పట్టేసి, తలుపులు, కిటికీలు ఊడిపోయి ఉంటాయి. ఏ క్షణాన వాటిల్లో నుంచి పాములు, విషపురుగులు వస్తాయోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. తుప్పు పట్టిన మంచాలపైనే నిద్రించాల్సి వస్తుండడంతో పాటు వారి పైన ఉండే శ్లాబ్ పెచ్చులు ఎప్పుడు ఊడి తమ మీద పడతాయోనని విద్యార్థులు నిత్యం భయంతో నిద్రిస్తున్నారు. కుళాయి పైప్ కనెక్షన్లు ఉన్నా ఏ పైపు నుంచి చుక్కనీరు కూడా రాదు. ఈ క్రమంలో మరుగుదొడ్లు, బాత్రూమ్‌కు వెళ్లాలంటే బకెట్‌తో నీరు పట్టుకువెళ్లాల్సిందే.

బోరు నీరే గతి..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుంకర వీధిలో ప్రారంభమైన బాలికల వసతిగృహానికి చెందిన విద్యార్థులకు అన్ని సదుపాయాలు ఉన్నా తాగునీటి కోసం బోరు నీటిపై ఆధారపడాల్సి వస్తోంది. మున్సిపల్ కుళాయిలు లేకపోవడం విచారకరం. హాస్టల్ బోరు కూడా బాగా తుప్పు పట్టేసింది. ఇదిలా ఉంటే హాస్టల్ గదులు, పరిసరాలు ఎప్పుడూ అపరిశుభ్రంగానే ఉంటాయి. కనీసం ఆడపిల్లలు ఉండే హాస్టళ్లలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం లేదు. దాసన్నపేటలో మేడపై అద్దె భవనంలో నిర్వహిస్తున్న హాస్టల్ పరిస్థితి దయనీయంగా ఉంది. సమస్యల వలయంలో విద్యార్థులు కాలం వెల్లదీస్తూ తమ గోడు పట్టించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. నిధులు ఉన్నా హాస్టళ్లను బాగు చేయడం లేదని వాపోతున్నారు.

నిధులు విడుదలయ్యాయి..



జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ల బాగు చేసేందుకు నిధులు విడుదలయ్యాయి. సుంకరి వీధి హాస్టల్‌కు సీఎస్ఆర్ కింద రూ.14.50 లక్షలు, డిపార్ట్‌మెంట్ నుంచి రూ.48 లక్షలు వచ్చాయి. ఈ నెలలోనే పనులు ప్రారంభిస్తాం. కాటవీధిలోని హాస్టల్‌కు కూడా రూ.32 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ హాస్టల్ పనులకు సంబంధించి టెండర్లు ఖరారయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. ఎస్.కోట ఎస్సీ కాలనీలో ఎస్సీ హాస్టల్, గజపతినగరం పురిటిపెంట న్యూ కాలనీలో బాలురు వసతి గృహాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి.

–బోని రామానందం,
జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, విజయనగరం

రామాలయం అభివృద్ధికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు కనకల కృష్ణ

విజయనగరం: విజయనగరం 21వ డివిజన్‌లోని నాగవంశంవీధి రామాలయం అభివృద్ధి కోసం ప్రముఖ వ్యాపారవేత్త, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కనకల కృష్ణ ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కనకాల కృష్ణను ఆలయ అభివృద్ధి నిమిత్తం విరాళం కోరగా తన తల్లిదండ్రులు దివంగతులు కనకల ఎర్రయ్య, బంగారమ్మ జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. రామాలయ అభివృద్ధిలో ఏ సహాయ సహకారాలు కావాలన్నా ముమ్మందు కూడా అందిస్తానని కనకల కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు బేరి సత్యనారాయణ, కాళ్ల సత్యనారాయణ, మద్దిల దుర్గారావు, కాళ్ల సూరి బాబు, కనకల గిరి తదితర పెద్దలు పాల్గొన్నారు.

సీతంలో ముగిసిన ‘ఆండ్రాయిడ్’ వర్క్‌షాప్



సత్కారం పొందుతున్న సదస్సు శిక్షకుడు మహంతి పృథ్వి

విజయనగరం అర్బన్: గాజులరేగలో ఉన్న సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ‘ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలమెంట్’ అనే అంశంపై వారం రోజులుగా జరుగుతున్న వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త నిర్వహణలో కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎంసీఏ విద్యార్థుల కోసం ఈ వర్క్‌షాప్ చేపట్టామని ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. కోడింగ్ కాంపిటీషన్‌లో పాల్గొనే విధంగా చేసి వారిలో ఆసక్తి పెంపొందించారు. చివరి రోజున పోటీ కోడింగ్ వర్క్‌షాప్ గురించి విద్యార్థులు తమ అభిప్రాయాలు, అనుభవాలను పంచుకున్నారు. సదస్సులో శిక్షకునిగా వ్యవహరించిన మహంతి పృథ్వి మాట్లాడుతూ ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ కోర్సు ద్వారా వ్యాపారానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు పెంపొందించవచ్చని అన్నారు. అనంతరం సదస్సులోని శిక్షకుడిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కృత్రిమ మేధస్సు మరియు డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రాధ, వివిధ శాఖల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు.. ఇక అందని ద్రాక్షే..

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు ఇక అందని ద్రాక్షేనని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ విమర్శించారు. ఇదే విషయమై ఆయన మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ బూటకపు హామీలేనన్నారు. తల్లికి వందనం ఇవ్వలేదు గానీ తండ్రికి ఇంధనం(మద్యం) మాత్రం ఇచ్చారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ఎక్కడికక్కడ మద్యం ఏరులై పారుతోందని, తాగుడుతో చాలామంది జీవితాలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఆయన ఆడపిల్లలకు ప్రతినెలా ఇస్తానన్న రూ.1500 హామీ అడ్రస్ లేకుండా పోయిందన్నారు. అన్నదాత సుఖీభవ పేరిట రైతులకు ఇస్తానన్న రూ.20 వేల సాగు సాయం హామీ గాల్లో కలిసిపోయిందన్నారు. నిరుద్యోగ భృతి జాడే లేదన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి, ప్రజలను నిలువునా ముంచేశారన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని, ఇచ్చిన హామీలు అమలుచేయకుంటే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా రబీ వరిసాగు

లక్కవరపుకోట: మండలంలో రబీ వరిపంట ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది రబీసీజన్‌లో సుమారు 60 ఎకరాల్లో రైతులు వరి సాగుచేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. లచ్చింపేట, లక్కవరపుకోట, గొల్జాం, సీతారాంపురం గ్రామాల్లో పంట కోతదశకు చేరుకుంది. గత ప్రభుత్వంలో రైతులకు రైతుభరోసా పథకం పేరిట పెట్టుబడి సాయం అందేది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా పథకానికి అన్నదాత సుఖీభవగా ప్రభుత్వం పేరు మార్చింది కానీ గత ఖరీఫ్‌లోనూ రూపాయి పెట్టుబడి సాయం ఇవ్వలేదు. రబీలో కూడా ఇవ్వలేదు. రైతులు అప్పులు చేసి పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది.

వైద్యసిబ్బందికి సేవారత్న పురస్కారాలు

కొత్తవలస: విజయవాడకు చెందిన మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ సంస్థ, గ్లోబల్ ఫౌండేషన్ వారు మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సింహాద్రి నాయుడు,హెల్త్ అసిస్టెంట్ సత్యారావుకు సేవారత్న పురస్కారాలను ప్రదానం చేశారు. విజయవాడలోని అలంకార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారి, హెల్త్ అసిస్టెంట్‌ను నిర్వాహకులు సత్కరించి, అవార్డులు అందజేశారు. వైద్యాధికారి సింహాద్రి నాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలం దించడం, కోవిడ్ సమయంలో కరోనా నిర్ధారణ పరీక్షలు చేయడం, కోవిడ్ వ్యాక్సినేషన్, డెంగ్యూ, మలేరియా,టీబీ,లెప్రసీ వ్యాధులపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించినందుకు ఈ అవార్డులు అందజేశారని తెలిపారు. అవార్డు గ్రహీతలకు ఆస్పత్రి సిబ్బంది అభినందనలు తెలిపారు.

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఏటా వసంత రుతువులో చైత్రశుద్ధ నవమి నాడు ఈ ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీ. ఇదే రోజున శ్రీరాముని జననం, పట్టాభిషేకం, సీతారాముల కల్యాణం జరిగిందని ప్రతీతి. ఈ నేపథ్యంలో ఆలయాల వద్ద పండగ వాతావరణం నెలకొంది. వేకువజాము నుంచే మందిరాలకు చేరుకున్న భక్తులు శ్రీరామునికి ప్రత్యేక పూజలు చేసి, సీతారాముల కల్యాణోత్సవం, పట్టాభిషేకం తిలకించి, మంత్రముగ్ధులయ్యారు.

–విజయనగరం, నెల్లిమర్ల నెట్‌వర్క్



నెల్లిమర్ల రూరల్: రామతీర్థంలో శ్రీరామనవమి వేడుకల్లో ఆలయ ధర్మకర్త అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అతిది, ఎంపీ కలిశెట్టి తదితరులు



విజయనగరం రూరల్: కోరుకొండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



విజయనగరం టౌన్: కంటోన్మెంట్ గూడ్సు షెడ్ దగ్గరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి, తదితరులు



విజయనగరం టౌన్: హుకుంపేటలోని బుక్కా వీధిలో సీతారాముల కల్యాణం చేయిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు



పూసపాటిరేగలో సీతారాముల కల్యాణ దృశ్యం



విజయనగరంలోని ఎలుగుబంటి వారి వీధిలో సీతారామలక్ష్మణుల విగ్రహాల ఊరేగింపు



డెంకాడ: గంట్లాంలో శ్రీరామనవమి వేడుకల్లో భక్తుల సందడి

ముగిసిన రామాలయ ప్రతిష్ఠోత్సవాలు



ఆలయ ప్రతిష్ఠోత్సవాలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: భూపాల రాజపురంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రామాలయ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వేదపండితులు రేజేటి రామాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి సీతారామలక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. సీతారాములను మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పల నాయుడు దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, సర్పంచ్ నేరేడుబిల్లి గురునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రూ.3లక్షల విరాళం

రామాలయానికి వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్ రూ.3 లక్షలు విరాళం అందజేశారు. నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.